క్లుప్తంగా

ఇంటింటి సర్వే


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామంలో జిల్లా ఆరోగ్య శాఖ నెల్లూరు కార్యాలయం ఫ్లోరోసిస్ విభాగం వారు గురువారం ఇంటింటి సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించగా ఆరుగురికి ఫ్లోరోసిస్ ఉన్నట్టు గుర్తించారు. నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి మందులను పంపిణీ చేశారు. అంకుపల్లి ఫ్లోరోసిస్ ఉన్న గ్రామంగా నమోదు చేసినట్టు ఆ విభాగం అధికారిణి అనిత వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మమల, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది రవికుమార్, ప్రవల్లిక, సోనీ, ప్రసాద్, ఆశా వర్కర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో సాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకి సేవ జరిగింది.

➡ మనుబోలు: మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో విశేష పూజలు జరిగాయి. అర్చకులు శ్రీనివాసులు బాబా విగ్రహానికి పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

సమస్యలపై చైర్‌పర్సన్‌కు వినతి



కొడవలూరు(బుచ్చిరెడ్డిపాలెం): బుచ్చి నగర పంచాయతీలో తాగునీరు, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు ఆమె కార్యాలయంలో బీజేపీ నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలో 85 విద్యుత్ మోటార్లు ఉంటే సింహభాగం తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో తాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. స్పేర్ మోటార్లను అందుబాటులో పెట్టుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా నగర పంచాయతీల్లో వందల వీధిలైట్లు ఉన్నా ఎక్కడైనా కాలిపోతే మార్చడం లేదన్నారు. బీజేపీ నాయకులు రమణయ్య, శీనయ్య, శాలిని రాణి, సుధాకర్, మణికంఠ, శ్రీనివాసులు ఉన్నారు.

కండలేరులో 27.880 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 27.880 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,050, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదకరంగా కలువాయి - సోమశిల రహదారి


గుంతలో ఇరుక్కున్న లారీ

కలువాయి(సైదాపురం): వర్షం కురిస్తే కలువాయి – సోమశిల ప్రధాన రహదారి దారుణంగా మారుతోంది. దీంతో వాహనదారులు ప్రయాణించాలంటేనే హడలిపోతున్నారు. ఆ మార్గంలో వెంకటరెడ్డిపల్లి జంక్షన్ వద్ద పెద్ద గుంత ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా బురదమయంగా ఉండటంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యాన పంటలకు వరుస నష్టాలు

- రాయితీలు పెంచినా ఆసక్తి చూపని రైతులు
- మితిమీరిన ఖర్చులు, అకాల వర్షాలతో నష్టాలు
- ధర లేని నిమ్మ, మామిడి
- పెరగని పూలతోటల సాగు విస్తీర్ణం


నిమ్మతోటల పెంపకం

పొదలకూరు: జిల్లాలో పండ్లు, పూల తోటల విస్తీర్ణం పెంపొందించేందుకు ప్రభుత్వం రాయితీలను పెంచింది. అయితే గిట్టుబాటు కాని ధరలు, అకాల వర్షాల వల్ల రైతులు పంటల మార్పిడికి ఆసక్తి చూపడం లేదు. ప్రధానంగా నిమ్మ, మామిడి సాగు ఉన్నా ఈ ఏడాది తీవ్ర నష్టాలను చవిచూశారు. ఉద్యాన శాఖ పంటల విస్తీర్ణం పెంపొందించేందుకు కృషి చేస్తున్నా మెట్ట రైతులు నిమ్మ, మామిడి, బత్తాయి పంటలను విడిచి ఇతర పంటల జోలికి వెళ్లడలేదు. గతంలో ప్రభుత్వం ఉద్యాన పంటలకు చేయూతనివ్వడంతో విస్తీర్ణం ఆశించిన మేరకు పెరిగింది.

70 శాతం మంది

ప్రధానంగా 70 శాతం మంది రైతులు వరిసాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే పంట మార్పిడి పద్ధతిని అలవాటు చేసే దశగా ప్రభుత్వాలు ఉద్యాన పంటలను గణనీయంగా పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయి. జిల్లాలో ఉద్యాన పంటలు సుమారు 55 వేల ఎకరాల్లో సాగవుతుండగా ఈ సంఖ్యను 75 వేల ఎకరాలకు పెంపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా పండ్లు, కూరగాయలు, పూలతోటల సాగును పెంపొందించేందుకు రాయితీలను అందిస్తున్నారు. నిమ్మ, మామిడి విస్తీర్ణం పెరుగుతున్నా మిగిలిన పండ్ల తోటల సాగు ఇంకా పెరగాల్సి ఉంది.

పెరిగిన నిబంధనలు

రాయితీలు పెంచిన ఉద్యాన శాఖ దానికి అనుగుణంగా నిబంధనలను కూడా కఠినతరం చేసినట్టు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గైడ్‌లైన్స్‌ను సైతం విడుదల చేయడం జరిగింది. నిమ్మ, మామిడి తోటల పెంపకానికి నిర్దేశించిన సంఖ్యలో మొక్కలు ఉండాలని, కొత్తగా నర్సరీలకు ల్యాబ్ సర్టిఫికెట్‌తోపాటు నీటి సౌకర్యం తదితరాలను చూపాలని, నీటికుంటలకు విధిగా విద్యుత్ సౌకర్యం, ఎత్తిపోసుకునేందుకు విద్యుత్ మోటార్ ఉండాలని నిబంధనలున్నాయి.

వీటికి రాయితీలు

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రాయితీలను ప్రకటించింది. రెండు విడతలుగా పంపిణీ చేసి రైతులకు పండ్ల తోటల సాగుపై ఆసక్తి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మామిడి, నిమ్మ, బొప్పాయి, అరటి, హైబ్రిడ్ పూల సాగు, తోటల్లో నీటికుంటల తవ్వకం, పాలీహౌస్, నర్సరీలు, సోలార్ కోల్డ్‌రూమ్స్ తదితరాలకు రాయితీలున్నాయి.


కూరగాయల సాగు

పంటల సాగుకు ప్రోత్సాహం



ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీలను పెంచడం జరిగింది. ప్రధానంగా పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. రైతుల అనుమానాలను క్షేత్రస్థాయికి వెళ్లి నివృత్తి చేస్తాం. రాయితీల వివరాలను తెలియజేయడం జరుగుతుంది.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

మాదకద్రవ్యాలతో జీవితాలు బుగ్గిపాలు


బుచ్చిరెడ్డిపాలెం డీఎల్ఎన్నార్ కళాశాలలో..

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాలు బుగ్గిపాలవుతాయని ఎస్సై సంతోష్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక డీఎల్ఎన్నార్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలతో అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం దుర్భరంగా మారుతుందన్నారు. సరదా కోసం కూడా ఎట్టి పరిస్థితుల్లో మత్తు పదార్థాలు సేవించరాదని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు: యువత ముఖ్యంగా విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పొదలకూరు ఎస్సై ఎస్కే హనీఫ్ అన్నారు. పట్టణంలోని ఎస్‌వీబీవీడీ డిగ్రీ కాలేజీలో అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటికి అలవాటు పడితే భవిష్యత్ నాశనమవుతుందన్నారు. మాదకద్రవ్యాల కేసుల్లో ఇరుక్కుంటే బయటకు రావడం కష్టమన్నారు. సదసులో కాలేజీ కరస్పాండెంట్ తూపిలి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

➡ విడవలూరు: మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.నరేష్ అన్నారు. స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొన్ని నగరాలకు మాత్రమే పరిమితమైన డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు నేడు గ్రామాల్లోకి కూడా వస్తోందని, దీనిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాగే యువత సైబర్ నేరాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బీడీ దీనదయాల్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విడవాలూరు ప్రభుత్వ కళాశాలలో..


పొదలకూరులో మాట్లాడుతున్న ఎస్సై

మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుని అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నారని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ సభ్యులు, మహిళా మండల పరిషత్ అధ్యక్షులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు పాలనలో పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పారదర్శకత పెరిగిందన్నారు. వనరుల వినియోగం సక్రమంగా జరుగుతోందన్నారు. తక్కువ విద్య, శిక్షణా లోపం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోలేకపోవడం, ఆత్మవిశ్వాస లోపం, సామాజిక ఒత్తిళ్ల వల్ల మహిళలు కాస్త వెనుకడుగు వేస్తున్నారని, వీటిని తప్పకుండా అధిగమించాలన్నారు. శిక్షణా కార్యక్రమాల్లో నాయకత్వం, నిధుల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానంపై సాధన చేయాలన్నారు. చదువు, చైతన్య వంతమైన మహిళ గ్రామ రూపురేఖలను మార్చగలదన్నారు. శిక్షణా కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, మాస్టర్ ట్రెయినీలు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు

నెల్లూరు(అర్బన్): డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆదేశాల మేరకు నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లపై వైద్యాధికారులు గురువారం తనిఖీలు చేశారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, వెంకటాచలం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వేదవల్లి వాణిశ్రీ, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నర్సింహులు, ప్రైవేట్ ఫౌండేషన్, సరోగసి యాక్ట్ ఇంప్లిమెంటేషన్ స్టేట్ బోర్డు మెంబర్ కవితారెడ్డిలు నగరంలోని లోటస్ ఆస్పత్రి, ఆండాళ్ హాస్పిటల్, సరయు ఆస్పత్రి, ఇమేజ్ స్కాన్ తదితర సెంటర్లను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో రికార్డులు పరిశీలించారు. అనంతరం అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల యజమానులు పీసీపీఎన్‌డీటీ చట్టం నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ వివరాలకు సంబంధించిన ఫారమ్–4ను క్రమం తప్పకుండా ప్రతినెలా మొదటి వారంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కో–ఆర్డినేటర్ విజయకుమార్, హరీష్, భవ్య ఆర్గనైజేషన్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

పొదలకూరు: పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల క్షేత్రస్థాయి సిబ్బందికి మూడురోజులపాటు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు గురువారం మొదలయ్యాయి. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో దీనిని ప్రారంభించారు. పొదలకూరు, మనుబోలు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాల క్షేత్ర సహాయకులతో వ్యవసాయ శాఖ కమిషన్ ఆన్‌లైన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్‌తో ప్రశ్నోత్తరాలు నిర్వహించినట్టు పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ వెల్లడించారు. శుక్రవారం నుంచి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ఈ తరగతుల్లో పాల్గొంటారన్నారు. ఏఓ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

15 లోగా నీటి వనరుల గణన పూర్తి

వెంకటాచలం: మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చే నెల 15వ తేదీలోగా నీటి వనరుల గణన కార్యక్రమాన్ని వీఆర్వోలు పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ నీటి వనరులైన చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు, బోరు బావులు, తవ్వక బావులు తదితర వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని తెలియజేశారు. రైతులు ఈ ప్రక్రియకు సహకరించాలని వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: గడ్డిమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇస్కపాళేనికి చెందిన నరాల బలరామయ్య (59) కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం తన నివాసంలో గడ్డిమందు తాగి పడిపోయాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. బలరామయ్య కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ల కొరతను తీర్చాలి


ఎస్టీయూ సభ్యత్వ నమోదులో నాయకులు

నెల్లూరు(టౌన్): నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎస్టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజమనోహర్, ప్రధాన కార్యదర్శి నరసింహం తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద పిల్లలు చదివే పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులు లేనందున కొందరిపై భారం పడుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ కార్పొరేషన్ బాధ్యులు వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రకటనలు హాస్యాస్పదం


మాట్లాడుతున్న చెరకు రైతు సంఘం నాయకుడు శ్రీరాములు

కోవూరు: రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కొందరు కోర్టు స్టేలు తెచ్చి కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, కాగా రెండు నెలల్లో అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న మంత్రి టీజీ భరత్ చేస్తున్న ప్రకటన హాస్యాస్పదమని ఏపీ చెరకు రైతు సంఘం నాయకుడు పులిగండ్ల శ్రీరాములు అన్నారు. కోవూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాజాగా పోతిరెడ్డిపాళెంలో జరిగిన సమావేశంలో మంత్రి భరత్ మాట్లాడుతూ కార్మికుల బకాయిలు చెల్లించడానికి స్టే అడ్డంకిగా ఉందన్న ధోరణి చూపారని, ఇది సరికాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరు నెలల క్రితం కార్మికుల బకాయిలు చెల్లిస్తామని ప్రకటించారని, ఆ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి కోర్టు స్టే అడ్డంకి కాదన్నారు. కార్యక్రమంలో జిల్లా చెరకు రైతు సంఘం కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, నాయకులు రఘురామయ్య, బాబు, మల్లికార్జునరెడ్డి, బుజ్జయ్య, పెద్దబ్బయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాద్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం



కొడవలూరు: కొడవలూరు సచివాలయంలో పని చేస్తూ వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు గురువారం ఘన సన్మానం చేశారు. స్థానిక సచివాలయంలో పనిచేస్తూ వెల్ఫేర్ అసిస్టెంట్ కె.బాలకృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ టి.శ్రీకాంత్, మహిళా పోలీస్ పి.వెంకటసుబ్బమ్మ, ఏఎన్ఎం జి.సుభాషిణి, వీఏఏ జి.కవిత బదిలీ అయ్యారు. ఈ క్రమంలో వీరిని పంచాయతీ కార్యదర్శి కె.మురళి, స్థానిక నాయకులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.కామాక్షి, స్థానిక నాయకులు జిలానిబాషా, కోవూరు వెంకీ, నక్కా రమణయ్య, దుంపల బాబు, పి.శ్రీనివాసులు, నాయబ్ రసూల్, అంబటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బాలచౌడేశ్వరి అమ్మవారికి పొంగళ్లు


పొంగళ్లు పెడుతున్న భక్తులు


ప్రత్యేకాలంకరణలో చాముండేశ్వరీదేవి

పొదలకూరు: పట్టణంలోని తొగటవీధిలో ఉన్న శ్రీబాలచౌడేశ్వరి అమ్మవారి జన్మదినం సందర్భంగా తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. మేళతాళాలు, భజనల నడుమ మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రితో ఆలయం వద్దకు చేరుకున్నారు. నాలుగేళ్లుగా అమ్మవారి జన్మదినం సందర్భంగా పొంగళ్లు పెడుతున్నట్లు తెలిపారు.

➡ పట్టణంలోని దేవాంగవీధిలో గురువారం శ్రీరామలింగేశ్వర సమేత చాముండేశ్వరీదేవి జయంతిని ఆషాఢ అమావాస్య సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, పూజలు, సాయంత్రం భజనలు, నైవేద్యం, ఖడ్గపద్యములతో తలియ కార్యక్రమం జరిపారు. ఉభయకర్తలుగా పముజుల శంకరయ్య, శ్రీనివాసులు వ్యవహరించారు.

రసాయన ఎరువులను తగ్గించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి

కోవూరు: రైతులు వ్యవసాయ సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన రసాయన పద్ధతులతో భూమి సారవంతం తగ్గిపోతోందని, జీవవైవిధ్యం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడితో పాటు భూసారం పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో వ్యవసాయ శాఖ నవధాన్యాల కిట్లు అందిస్తోందన్నారు. ఇవి భూసారాన్ని పెంచడంతో పాటు, పంటల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకురాలు జి.అనిత, మండల వ్యవసాయాధికారులు టి.రజని, ఎస్.శ్రీహరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో పంట కాలువ పనులు


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: మండల కేంద్రంలో రూ.92 వేలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పంట కాలువలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మనుబోలు పరిధిలోని పొలాల్లో జరుగుతున్న పంట కాలువల పనులను గురువారం ఆమె పరిశీలించారు. మస్టర్ ప్రకారం కూలీలు వస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రైతులకు అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీఏలు గురప్ప, ఎఫ్ఏ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు ప్రధాని చిత్రపటాలు



కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు బీజేపీ అర్బన్ అధ్యక్షుడు రామిశెట్టి కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాలను గురువారం పంపిణీ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, నగర పంచాయతీ కార్యాలయంతో పాటు వవ్వేరు, కట్టుబడిపాళెం, పెద్దూరు, రామకృష్ణానగర్ సచివాలయాలకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు కాసా శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, నరసింహులు, లక్ష్మయ్య, రమణమ్మ, శేషసాయి పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహునికి ఘన నివాళి


అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

కొడవలూరు: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని స్థానిక గ్రంథాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ అనేక ప్రాంతాల్లో గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన అభ్యుదయ వాది అయ్యంకి అని తెలిపారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు.